సాక్షి
బాపట్ల
బుధవారం । 17 । ఏప్రిల్ । 2024



అగ్నిమాపక వారోత్సవాలు

నరసరావుపేటరూరల్: కోటప్పకొండ టీటీడీ వేద పాఠశాలలో మంగళవారం అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.



గ్రంథాలయం సందర్శన

యడ్లపాడు: స్థానిక శాఖా గ్రంథాలయాన్ని మంగళవారం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సుబ్రతమ్మ సందర్శించారు. పుస్తకాలు అందుబాటులో ఉంచాలని చెప్పారు.

నిమ్మకాయల ధరలు



తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో మంగళవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.5000, గరిష్ట ధర రూ.6500, మోడల్ ధర రూ.5800 వరకు పలికింది.

న్యూస్‌రీల్

పరిశీలకుల కోసం ఏర్పాట్లు చేయండి

జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి



గుంటూరు వెస్ట్ : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాకు రానున్న పరిశీలకులు ఉండేందుకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక రోడ్లు భవనాల వసతి గృహంలోని గదులను కలెక్టర్, అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం నియమించే పరిశీలకులు జిల్లాకు రానున్నారని వారికి ఇబ్బందులు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఈ బాధ్యతలను జిల్లా అటవీ శాఖాధికారి మహబూబ్ బాషాకు అప్పగించారు. కలెక్టర్‌తో ఆర్డీఓ పి.శ్రీకర్, డీఎస్‌ఓ కోమలి పద్మ, అధికారులు ఉన్నారు.

నేటి నుంచి ఏబీసీకి నీరు విడుదల

డీఈ రామారావు



శావల్యాపురం: తాగునీటి అవసరాల నిమిత్తం అద్దంకి బ్రాంచ్ కెనాల్‌కు సాగర్ జలాలు విడుదల చేస్తున్నట్లు ఎన్నెస్పీ డీఈ చాట్రగడ్డ రామారావు తెలిపారు. మంగళవారం మండలంలోని పోట్లూరు వద్ద అద్దంకి బ్రాంచ్ కెనాల్(ఏబీసీ)ని పరిశీలించారు. డీఈ మాట్లాడుతూ ఈనెల 8న సాగర్ జలశయం నుంచి 5,500 క్యూసెక్కులు విడుదల చేసినట్లు చెప్పారు. ఈనెల 12వ నాటికి కెనాల్‌కు నీరు చేరిందని, ఇప్పటి వరకు ప్రకాశం జిల్లా పరిధిలో అన్ని మేజరు కాలువలకు 900 క్యూసెక్కులు సరఫరా చేసినట్లు వివరించారు. పల్నాడు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఏబీసీ పరిధిలోని 26 మేజరు కాలువలకు 900 క్యూసెక్కులు విడుదల చేశామన్నారు. మంచినీటి చెరువులు, వాగులు, కుంటలు నూరుశాతం సాగర్ జలాలతో నింపాలని కోరారు. నీటిని తాగునీటి అవసరాల నిమిత్తమే వినియోగించాలని, నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా శావల్యాపురం పోలీసు స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేశామన్నారు. ఈనెల 25వ తేదీ వరకు సాగర్ జలాలు సరఫరా చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎన్నెస్పీ, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల పర్యవేక్షణలో మంచినీటి చెరువులన్నీ పూర్తి స్థాయిలో నింపే బాధ్యత తీసుకోవాలని కోరారు. ఆయనతో పాటు ఏఈ పోట్లూరి లక్ష్మీనారాయణ, ఎన్నెస్పీ సిబ్బంది నందకిషోరు ఉన్నారు.

108 ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు మెడికల్ : జిల్లాలో అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సర్వీసెస్ 108 అంబులెన్సుల్లో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ (ఈఎంటీ) ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు 108 జిల్లా మేనేజర్ జి.నాగదీప్ తెలిపారు. అభ్యర్థులకు బీఎస్సీ, బీఫార్మసీ, బీఎస్సీ నర్సింగ్, డీఎంఎల్టీ ఐదేళ్ల అనుభవం అర్హతతోపాటు 35 సంవత్సరాల్లోపు వయస్సు ఉండాలన్నారు. ప్రత్తిపాడు, తెనాలి, మంగళగిరి, వట్టిచెరుకూరు, తుళ్లూరు, ఫిరంగిపురం, కొల్లిపర మండలాల్లో పనిచేయాల్సి ఉంటుందన్నారు. అర్హత ఉన్నవారు తమ సర్టిఫికెట్లతో ఈ నెల 20వ తేదీ లోపు గుంటూరు డీఎంహెచ్‌ఓ కార్యాలయం రెండో అంతస్తులోని తమ ఆఫీసులో సంప్రదించాలన్నారు. పూర్తి వివరాలకు 9121892889 నంబరు సంప్రదించాలన్నారు.

యార్డులో 88,620 బస్తాల మిర్చి విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 68,903 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 88,620 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ. 17,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 19,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.10,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 64,678 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు.

చీరాలలో వైఎస్సార్ సీపీ జోష్

- గ్రామాలు, పట్టణాల్లో భారీగా పార్టీలో చేరికలు
- అభ్యర్థి కరణం వెంకటేష్‌కు మద్దతుగా ఊపందుకున్న ప్రచారాలు



వెంకటేష్‌కు మద్దతు ప్రకటిస్తున్న నియోజకవర్గ యాదవ సంఘీయులు (ఫైల్)

చీరాల: ప్రతిపక్షాలు అంతా ఒక్కటయ్యాయి.. ఎలాగైనా గెలవాలనే ఉద్దేశంతో అక్రమదారులు వెతుక్కుంటున్నారు. టీడీపీ కార్యకర్తలకే రోజు కండువాలు వేసి ఇతర పార్టీలోంచి ఆ పార్టీలోకి వస్తున్నట్లు కలరింగ్‌లు ఇస్తున్నారు. దీనిని పచ్చమీడియా బుజానెత్తుకుని రాస్తున్నాయి. అయితే ఇవేమి పట్టించుకోని వైఎస్సార్ సీపీ చీరాల అసెంబ్లీ అభ్యర్థి కరణం వెంకటేష్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. ప్రతి పల్లెలోకి వెళ్లి ప్రజలను కలిసి ఒక్కసారి అవకాశమివ్వాలని కోరుతున్నారు. వారి నుంచి కూడా విపరీతమైన స్పందన రావడంతో వెంకటేష్ మరింత ఉత్సాహంగా ముందుకెళుతున్నారు. టీడీపీకి అనుకూలమైన దేవినూతల, గవినివారిపాలెం, వాడరేవు, దేశాయిపేట, దేవాంగపురి, పందిళ్లపల్లి గ్రామాల్లో భారీ మద్దతు తెలుపుతున్నారు. వాడరేవులో దాదాపుగా టీడీపీ ఖాళీ అయిన పరిస్థితి ఏర్పడింది. పట్టణ ప్రాంతంలో అధికంగా ఉండే ఆర్యవైశ్యులు కరణం వెంకటేష్‌కు బ్రహ్మరథం పడుతున్నారు. దళితవాడల్లో యువత, మహిళలు, దివ్యాంగులు సైతం వెంకటేష్‌కు జై కొడుతున్నారు.

మద్దతు తెలిపిన యాదవ సామాజికవర్గం..

రూరల్ మండలంలో అధికంగా ఉండే యాదవ సామాజికవర్గం ఆత్మీయ సమావేశం నిర్వహించి వెంకటేష్ వెన్నంటే ఉంటామని మద్దతు ప్రకటించింది. చీరాల టీడీపీ సీటును కూటమి అభ్యర్థిగా పక్క జిల్లాకు చెందిన ఎంఎం కొండయ్యకు ఇచ్చారు. యాదవ సామాజిక వర్గానికి చెందిన కొండయ్య ఆ సామాజిక వర్గం నాయకుల పట్ల వ్యవహరిస్తున్న దురుసు ప్రవర్తన, సీనియర్ యాదవ నాయకులను కాదని ఇతర ప్రాంతాలకు చెందిన కొందరిని అనుచరులుగా పెట్టుకుని యాదవులనే పట్టించుకోకపోవడం లేదని జోరుగా ప్రచారం జరుగుతుంది. ఆది నుంచి ఎమ్మెల్యే కరణం వెన్నంటే ఉంటున్న యాదవులు, ప్రస్తుత టీడీపీ అభ్యర్థి కొండయ్య వ్యవహార శైలితో విసుగు చెంది వైఎస్సార్ సీపీ అభ్యర్థి వెంకటేష్‌కు పూర్తి మద్దతు ప్రకటించారు. యాదవులకు కరణం కుటుంబం అంటే ఉన్న అభిమానం, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి యాదవులకు ఇచ్చిన ప్రాముఖ్యత, నామినేటెడ్ పదవులకు వెంకటేష్‌కు బాగా కలిసి వచ్చే అంశం. గత ఇరవై ఐదు రోజుల నుంచి చీరాల నియోజకవర్గంలోని యాదవ, ఆర్యవైశ్య, దేవాంగ, రజక, ఆత్మీయ సమ్మేళనాలతో పాటుగా వివిధ సామాజిక వర్గాల నాయకులు, కార్యకర్తలు భారీగా వెంకటేష్‌కు మద్దతిచ్చి పార్టీ బలోపేతానికి, సీఎంగా జగనన్నను, ఎమ్మెల్యేగా కరణం వెంకటేష్‌ను గెలిపించుకుంటామని హామీలు ఇవ్వడం శుభ పరిణామమే.

వేటపాలెం మండలంలో టీడీపీ గట్టి షాక్

వేటపాలెం మండలం రామన్నపేటలోని యానాది సంఘం పెద్దలు వైఎస్సార్ సీపీ అభ్యర్థి వెంకటేష్‌ను కలిసి తమ మద్దతు ప్రకటించారు. మండలంలోని దేవాంగపురి గ్రామ పంచాయతీలో టీడీపీకి గట్టి షాక్ తగిలింది. టీడీపీని వీడిన 150 కుటుంబాలు వైఎస్సార్ సీపీ అభ్యర్థి కరణం వెంకటేష్ ఆధ్వర్యంలో ఎంపీ నందిగం సురేష్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వేటపాలెం మడలం బచ్చులవారిపాలేనికి చెందిన తెలుగుదేశం పార్టీకి చెందిన 75 కుటుంబాలు ఆ పార్టీని వీడి ఎమ్మెల్యే కరణం బలరాం, వెంకటేష్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరాయి.

వాడరేవు సంపూర్ణ మద్దతు..

మండలంలోని వాడరేవు పంచాయతీ పాకల గ్రామంలో టీడీపీ నుంచి సుమారు 120 కుటుంబాలు వెంకటేష్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరాయి. చీరాలలో అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయడంతోపాటుగా అన్నీ వ్యాపారవర్గాలకు అండగా నిలిచారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పూర్తి సహాయ సహకారాలతో అభివృద్ధి పనులను పూర్తిచేసి చీరాల్లో కరణం మార్క్ పాలన అందించడంతో ఎలాంటి వివాదాలు, ఘర్షణలు లేకుండా ప్రశాంత వాతావరణం నియోజకవర్గంలో కల్పించడంతో వారు మద్దతు ప్రకటించారు.



వాడరేవులో వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ నాయకులు, కార్యకర్తలతో వెంకటేష్(ఫైల్)

నామినేషన్లకు సర్వం సిద్ధం

జిల్లా ఎన్నికల అధికారి పి.రంజిత్‌బాషా

బాపట్ల: ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ప్రారంభించడానికి అన్ని ఏర్పాట్లు చేశామని జిల్లా ఎన్నికల అధికారి పి.రంజిత్ బాషా చెప్పారు. గుర్తింపు పొందిన రాజకీయపార్టీల నాయకులతో మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో ఆయన సమావేశం నిర్వహించారు. పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన ఆర్వో కార్యాలయాన్ని కలెక్టరేట్‌లో ఏర్పాటు చేశామని తెలిపారు. పార్లమెంట్ నియోజకవర్గానికి నామినేషన్ వేసే అభ్యర్థులు రూ.25వేలు సెక్యూరిటీ డిపాజిట్ చేయాల్సి ఉందన్నారు. బాపట్ల ఎస్సీ రిజర్వ్ కావడంతో ఎస్సీ అభ్యర్థులైతే 50 శాతమే డిపాజిట్ చేయడానికి ఎన్నికల కమిషన్ వెసులుబాటు కల్పించిందన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాలలో నామినేషన్ వేసే అభ్యర్థులు రూ.10 వేలు సెక్యూరిటీ డిపాజిట్ చేయాల్సి ఉందన్నారు. ఎస్సీ రిజర్వ్ నియోజకవర్గాలలో 50శాతమే డిపాజిట్ ఉంటుందన్నారు. నామినేషన్ వేయడానికి వచ్చే అభ్యర్థి, తనతోపాటు మరో నలుగురిని మాత్రమే ఆర్‌ఓ వద్దకు అనుమతిస్తామన్నారు. ఉదయం 11 నుంచి సాయంత్రం మూడు గంటల వరకు అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసుకోవచ్చన్నారు.

నియమావళి పకడ్బందీగా అమలు చేస్తాం

ఎన్నికల ప్రవర్తనా నియమావళి పకడ్బందీగా అమలు చేస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి రంజిత్ బాషా తెలిపారు. సి-విజిల్‌లో నమోదైన 270 ఫిర్యాదులను పరిశీలించి తక్షణమే చర్యలు తీసుకున్నామన్నారు. కోడ్ ఉల్లంఘించిన ఉద్యోగులు, వలంటీర్లపై చర్యలు తీసుకున్నామన్నారు. ఎంసీసీ కింద నాలుగు కేసులు నమోదయ్యాయన్నారు. నామినేషన్ సమయంలో ఆర్‌ఓ కార్యాలయం వద్ద వీడియోలు, సీసీ కెమెరాల నిఘా ఉంటుందని వివరించారు. నామినేషన్ దాఖలు చేసే ప్రతి అభ్యర్థి ప్రతిపాదకుని పేరు ఓటరు జాబితాలో ఉందో లేదో పరిశీలించుకోవాలన్నారు. నామినేషన్ ప్రక్రియపై సందేహాలు నివృత్తి చేసుకోవడానికి కలెక్టరేట్‌లోని డీఆర్‌ఓను సంప్రదించాలన్నారు. నామినేషన్ ప్రక్రియ తదుపరి అభ్యర్థులు తమకు ఏజెంట్లు నియమించుకోవచ్చన్నారు.

24 గంటలపాటు సరిహద్దులలో నిఘా

జిల్లా సరిహద్దులలో 24 గంటలపాటు పనిచేసే నిరంతరం నిఘా వ్యవస్థను ఏర్పాటు చేశామని జిల్లా ఎన్నికల అధికారి పి.రంజిత్‌బాషా చెప్పారు. జిల్లాలో 54 ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్‌లు పనిచేస్తున్నాయని, వెబ్ క్యాస్టింగ్ ఏర్పాటు చేశామన్నారు. 12 చెక్‌పోస్టుల వద్ద స్టాటిస్టికల్ సర్వేలెన్స్ టీములు రేపటి నుంచి పనిచేస్తాయన్నారు. కోడ్ వచ్చిన నాటి నుంచి ఇప్పటివరకు నగదు, మద్యం, వెండి, బంగారం, ఇతర కానుకల రూపంలో ఓటర్లను ప్రలోభ పెట్టడానికి ఇచ్చే బహుమతులను సీజ్ చేయగా వాటి విలువ రూ.2.72 కోట్లు ఉందన్నారు. యంత్రాంగం సమర్థంగా పనిచేస్తుందని వివరించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సీతారామయ్య, మల్లేశ్వరి, బీజేపీ నాయకులు కేవీ రామకృష్ణ, బీఎస్పీ నాయకులు కె.కోటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు డి.రవి, సీపీఎం నాయకులు శరత్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఐ మాల్యాద్రి, టీడీపీ నాయకులు ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



రాజకీయపార్టీల నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి పి.రంజిత్‌బాషా

మా మొదటి ఓటు జగనన్నకే



యువకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి మేరుగ, ఎంపీ నందిగం సురేష్

వైఎస్సార్ సీపీలో చేరిన వెల్లంపల్లి యువకులు

మద్దిపాడు: మా మొదటి ఓటు జగనన్నకే వేస్తామని వెల్లంపల్లి గ్రామ యువకులు తెలిపారు. మండలంలోని వెల్లంపల్లి గ్రామంలో టీడీపీ కుటుంబ నేపథ్యంలో ఉన్న పలువురు యువకులు తమ తల్లిదండ్రులతో మాట్లాడి కుటుంబాలు మొత్తం వైఎస్సార్ సీపీకి అనుకూలంగా ఓట్లు వేసేందుకు నిర్ణయం తీసుకొని మంత్రి మేరుగ నాగార్జున, ఎంపీ నందిగం సురేష్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. మంత్రి మేరుగ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. యువకులు మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విధానాలు తమకు ఎంతో నచ్చాయని, అందుకే మరోమారు సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని ఎన్నుకునేందుకు తమ మొదటి ఓటును ఆయనకే వేయాలని నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. పార్టీ చేరిన వారిలో చల్లపల్లి కృష్ణవేణి, రాయపాటి రజని, ప్రతిమ, గోపి, వెంకటరమణ, రంగవల్లి, నాగమణి, మల్లికార్జున, ఆంజనేయులు, అన్వేష్, సాయిరామ్, అశోక్, జయ చంద్ర, మణి, కార్తీక్, చరణ్, చంద్రశేఖర్, శ్రీకాంత్, చిట్టిబాబు వెంకటేశ్వర్లు సుధాకర్ నాగరాజు, రమేష్, శ్రీనివాసులు, కె.వెంకటేశ్వర్లు, రత్నం నిత్యానంద్ ప్రసాద్ ఉన్నారు. కార్యక్రమంలో వారి వెంట పార్టీ మండల ప్రధానకార్యదర్శి వాకా కోటిరెడ్డి, గుడ్డపాతల రవి, మండవ బాల చంద్రమౌళి, శ్రీకాంత్ ఇతర నాయకులు ఉన్నారు.

నామినేషన్.. బీ అలర్ట్

- రేపటి నుంచి నామినేషన్ల స్వీకరణ
- నిబంధనలు వర్తిస్తాయంటున్న రిటర్నింగ్ అధికారి శ్రీకర్

ప్రత్తిపాడు: ఎన్నికల ప్రక్రియలో కీలక ఘట్టానికి సమయం ఆసన్నమైంది. మరో 24 గంటల్లో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ మొదలు కానుంది. ఈ నేపథ్యంలో ఎన్నికల బరిలో నిలవాలనుకునే అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసే సమయంలో పాటించాల్సిన నిబంధనలను, కచ్చితంగా సమర్పించాల్సిన పత్రాలను ఎన్నికల అధికారులు వివరించారు. నామినేషన్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను గుంటూరుజిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి పి. శ్రీకర్ మీడియాకు వివరించారు. ఇందుకు సంబంధించిన ఒక ప్రకటనను ఆయన మంగళవారం విడుదల చేశారు.

- నామినేషన్లను ప్రభుత్వ సెలవు రోజుల్లో కాకుండా షెడ్యూల్ ప్రకారం ఈనెల 18 నుంచి 25వ తేదీ వరకు స్వీకరిస్తారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 3 గంటల వరకు మాత్రమే నామినేషన్లు తీసుకుంటారు.
- నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థి భారత పౌరుడై ఉండటంతోపాటు 26-04-2024 నాటికి 25 సంవత్సరాలు వయస్సు పైబడి ఉండాలి.
- నామినేషన్‌ను ఫారం 2-బిలో రిటర్నింగ్ అధికారికి దాఖలు పరచాలి.
- నవీకరించబడిన ఫామ్-26(నామినేషన్ అఫిడవిట్)ను జత చేయాలి. ఫారం-26లో ఏ ఒక్క కాలమ్ కూడా సమాచారం నింపకుండా ఖాళీగా వదలకూడదు. ఖాళీలు ఉంటే నామినేషను తిరస్కరిస్తారు. పూర్తిగా నింపిన ఫామ్-26 నామినేషన్‌ను 25వ తేదీ సాయంత్రం 3 గంటల్లోపు దాఖలు చేయాలి. ఫామ్-26 లో ప్రతి పేజీపై అభ్యర్థి సంతకం, నోటరీ స్టాంపు, సంతకం ఖచ్చితంగా ఉండాలి.
- ప్రత్తిపాడు ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గం కావడంతో నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థులు రూ.5000 సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాలి. నేరుగా దాఖలు సమయంలో నగదును చెల్లించవచ్చు. లేదా చలానా ద్వారా కూడా చెల్లించవచ్చు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు కుల ధృవీకరణ పత్రం సమర్పించాల్సి ఉంటుంది.
- గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు వారు నిలబెట్టిన వ్యక్తులకు ఫామ్-ఏ, ఫామ్-బిలను నామినేషను మొదలైన రోజు నుంచి నామినేషన్ ముగిసే రోజు సాయంత్రం మూడు గంటల్లోపు అందించాలి.
- అభ్యర్థులు నాలుగు ఫొటోలను (2 సెం.మీ వెడల్పు, 2.5 సెం.మీ ఎత్తు) కలర్ లేదా బ్లాక్ అండ్ వైట్ ఫొటోలు ఇవ్వాల్సి ఉంటుంది. అందజేసే ఫొటో నామినేషను సమర్పించే నాటికి 3 నెలల ముందు తీసుకున్న ఫొటో అని డిక్లరేషన్ ఇవ్వాల్సి ఉంటుంది.
- పోటీ చేసే అభ్యర్థి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో, ఏ నియోజకవర్గంలోనైనా ఓటరుగా ఉండవచ్చు. వేరే నియోజకవర్గంలో ఓటరుగా ఉన్న వారు ఆర్వో లేదా ఏఆర్వో నుంచి సర్టిఫైడ్ కాపీ ఆఫ్ ఎలక్టోరల్‌ను జతపరచాల్సి ఉంటుంది. అయితే ప్రతిపాదకుడు మాత్రం కచ్చితంగా అభ్యర్థి పోటీ చేసే నియోజకవర్గములో ఓటరై ఉండాలి.
- అభ్యర్థి ప్రతిజ్ఞను ఖచ్చితంగా 25వ తేదీ 11.59 గంటల్లోపు చదివి సంతకం చేయాలి.
- అభ్యర్థి నమూనా సంతకం ఒక ఫామ్‌పై విడిగా ఇవ్వాలి.
- అభ్యర్థి పేరు ఏ విధంగా బ్యాలెట్ పేపర్‌లో ఉండాలని భావిస్తున్నారో స్పష్టంగా తెలియజేయాలి.
- గుర్తించబడిన జాతీయ, రాష్ట్ర పార్టీ అభ్యర్థులకు ఒక ప్రతిపాదకుడు పోటీ చేసే నియోజకవర్గ ఓటరుగా ఉండాలి. గుర్తించబడని రిజిస్టర్ పార్టీల వారు, స్వతంత్ర అభ్యర్థులను ఆ నియోజకవర్గంలోని ఓటరుగా ఉన్న 10 మంది వ్యక్తులు ప్రతిపాదించవచ్చు.
- రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి 100 మీటర్ల పరిధి వరకు మూడు వాహనాలు మాత్రమే అనుమతిస్తారు.
- నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థితోపాటు ఐదుగురు వ్యక్తులను మాత్రమే నామినేషను దాఖలు చేసేందుకు ఆర్వో కార్యాలయం లోపలకు అనుమతిస్తారు.
- అభ్యర్థి లేదా ప్రతిపాదకుడు మాత్రమే నామినేషను పత్రం సమర్పించాల్సి ఉంటుంది.
- ఒక అభ్యర్థి తరపున నాలుగు (4) సెట్లు నామినేషను పత్రాలను మాత్రమే దాఖలు చేయవచ్చు. అంతకు మించి అనుమతించరు. నాలుగు సెట్లు ఒకేసారి లేదా విడివిడిగా కూడా సమర్పించవచ్చు.
- నామినేషను దాఖలు తేదీకి ఖచ్చితంగా ఒకరోజు ముందుగా అభ్యర్థి పేరున లేదా అభ్యర్థి పేరు ఎలక్షన్ ఏజెంట్ పేరున జాయింట్ బ్యాంకు ఖాతాను తెరచి వివరాలను సమర్పించవలెను.
- అభ్యర్థులపై క్రిమినల్ కేసులు ఉంటే ఖచ్చితంగా న్యూస్ పేపర్, టీవీలలో ప్రకటన రూపంలో మూడు సార్లు తెలియజేయాలి.
- 29వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంది.



రాజకీయపార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో రిటర్నింగ్ అధికారి పి. శ్రీకర్

కోచింగ్ లేకుండానే కొట్టేశాడు...

- సివిల్ సర్వీసెస్‌లో 873వ ర్యాంక్
- రాహుల్‌ని అభినందిస్తున్న స్థానికులు



జగన్నాథం రాహుల్

అద్దంకి: ఎటువంటి కోచింగ్ లేకుండానే అద్దంకి కుర్రాడు ఐపీఎస్‌లో ర్యాంకు సాధించాడు. వివరాల్లోకి వెళితే.. పట్టణంలోని శ్రీనగర్ మొదటి లైన్‌లో నివసిస్తున్న జగన్నాథం బాబూరావు, గోళ్ల ప్రభావతి కుమారుడు రాహుల్ సివిల్ సర్వీసెస్ ఫలితాల్లో 873వ ర్యాంకు సాధించాడు. రాహుల్ ఎలాంటి కోచింగ్ తీసుకోకుండా సొంతంగా ప్రిపేర్ అయి ర్యాంక్ సాధించాడు. రాహుల్ ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు సెయింట్ జోసఫ్ అద్దంకి పాఠశాలలో చదివాడు. 6, 7 తరగతులు ఒక ప్రైవేటు పాఠశాలలోనూ, 8, 9, 10 తరగతులు గుంటూరు భాష్యం పాఠశాలలో చదివాడు. ఇంటర్ విజయవాడలోనూ, బీటెక్ చెన్నై ఐఐటీలో చదివాడు. రాహుల్ మొదటి ప్రయత్నంలోనే ర్యాంకు సాధించడం పట్ల ఆ కుటుంబ సభ్యులు, స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పట్టుదల, కృషి ఉంటే ర్యాంకు సాధించడం కష్టం కాదని రాహుల్ చెబుతున్నాడు.

నేడు గుంటూరులో శోభాయాత్ర

- శ్రీరామనవమికి ముస్తాబైన నగరం
- భారీగా హాజరు కానున్న శ్రీరామ.. హనుమాన్ భక్తులు

పట్నంబజారు: గుంటూరు నగరంలో బుధవారం శోభాయాత్ర వైభవోపేతంగా జరగనుంది. ప్రతి ఏటా శ్రీరామ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో జరుగుతున్న రథయాత్ర ఈ ఏడాది కూ డా ఘనంగా నిర్వహించనున్నారు. శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం జరగనున్న శోభయాత్రకు సంబంధించి ఇప్పటికే ఉత్సవ సమితి సభ్యులు ఏర్పాట్లుచేశారు. నగరాన్ని శ్రీరాముని చిత్రపటాలు, గోడ పత్రికలు, కాషా య రంగు తోరణాలతో ముస్తాబు చేశారు. యాత్ర బృందావన్‌గార్డెన్స్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి ప్రారంభమైన లక్ష్మీపురం, లాడ్జిసెంటర్, శంకర్‌విలాస్, ఓవర్‌బ్రిడ్జి, ఉమెన్స్‌కాలేజీ రోడ్డు, నాజ్‌సెంటర్, ఓల్డ్‌క్లబ్ రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్, ఎన్టీఆర్ సర్కిల్, బ్రహ్మానందరెడ్డి స్టేడియం, పాతబస్టాండ్, జిన్నాటవర్ సెంటర్, హిమని సెంటర్, కన్యకాపరమేశ్వరి ఆలయం, నల్లచెరువు మూడు బొమ్మల సెంటర్, ఎత్తురోడ్డు, చుట్టుగుంట మీదుగా మల్లారెడ్డినగర్‌లోని అయ్యప్పస్వామి ఆలయం వద్దకు చేరుకుంటుంది. ఉదయం 9.11 గంటలకు రథయాత్ర ప్రారంభం కానుంది.

అవ్వ మురిసింది...



సీఎం జగన్ చిత్రాన్ని ఆత్మీయతతో చూస్తున్న వృద్ధురాలు



సీఎం జగన్ చిత్రాన్ని ముద్దాడుతున్న వృద్ధురాలు

కొల్లూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల ద్వారా అవ్వలు, తాతలకు ఓ బిడ్డలా... అక్క, చెల్లెమ్మలకు ఓ అన్నలా వారి గుండెల్లో స్థానం సంపాదించుకున్నారు. అందుకు ఈ చిత్రాలే నిదర్శనం. బాపట్ల జిల్లా కొల్లూరులో ఈపూరు కాల్వకట్టపై వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చిత్రంతో కూడిన కరపత్రాన్ని వృద్ధురాలైన గోళ్ల సరస్వతికి అందించి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. అనంతరం ఆ కరపత్రంలో ఉన్న ముఖ్యమంత్రి వైఎస్.జగన్ ఫొటోని తదేకంగా చూస్తూ మురిసిపోయిన ఆ వృద్ధురాలు ఫొటోని ముద్దాడి సీఎంపై తనకున్న అభిమానాన్ని చాటుకుంది.

ఓటు వినియోగంతో సమాజ ప్రగతి

డీఆర్‌డీఏ పీడీ వై.పిచ్చిరెడ్డి


మహిళా ఓటర్ల మానవహారం

చీరాల టౌన్: రాజ్యాంగం పౌరుడికి కల్పించిన ఓటు వజ్రాయుధం లాంటిదని 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ విధిగా ఓటు హక్కు పొందడంతో పాటుగా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా డీఆర్‌డీఏ పీడీ, స్వీప్ నోడల్ అధికారి వై.పిచ్చిరెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని వాడరేవు గ్రామ పంచాయతీలోని ఓటర్లు, నూతనంగా ఓటు హక్కు పొందిన విద్యార్థులతో కలిసి ఓటు హక్కుపై అవగాహన కల్పించి ర్యాలీ, ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ పొందాలన్నారు. ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవడం ద్వారా మంచి చేసే ప్రజా ప్రతినిధులను ఎన్నుకోవచ్చన్నారు. ప్రజాస్వామ్యంలో కీలకమైన ఓటును అమ్ముకోవద్దని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ నోడల్ ఆఫీసర్ వెంకటరావు, శోభన్, ఏపీఎం సుబ్బారావు, వాడరేవు వీఏఓలు, మత్స్యకార మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి

లక్ష్మీపురం: గుంటూరు రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారంపై అనారోగ్యంతో బాధపడుతున్న గుర్తు తెలియని వ్యక్తిని గుంటూరు ప్రభుత్వ సమగ్రాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. రైల్వే జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 55 సంవత్సరాల వయస్సున్న ఓ వ్యక్తి ఫిబ్రవరి 20న గుంటూరు రైల్వే స్టేషన్‌లో నాలుగో ప్లాట్‌ఫారంపై అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీన్ని గమనించిన హౌస్ కీపింగ్ సూపర్‌వైజర్ మల్లికార్జునరావు 108 ద్వారా గుంటూరు ప్రభుత్వ సమగ్రాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. దీంతో జీఆర్పీ పోలీసులు గుర్తు తెలియని మృతిగా కేసు నమోదు చేశారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 9440627546, 9908383300 నంబర్లను సంప్రదించాలని కోరారు.

'ఎన్నికల్లో కూటమికి ఓటమి తథ్యం'

- కష్టపడిన ప్రతి కార్యకర్తకూ గుర్తింపు
- టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన 55 కుటుంబాలు
- పార్టీలోకి ఆహ్వానించిన అద్దంకి అసెంబ్లీ అభ్యర్థి చిన హనిమిరెడ్డి


వైఎస్సార్ సీపీలో చేరిన కొప్పరపాడు సుగాలీలు, నాయకులతో చిన హనిమిరెడ్డి


టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరిన వారితో పానెం నరసింహారెడ్డి

బల్లికురవ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కుల, మత, పార్టీలకు అతీతంగా అందిస్తున్న సంక్షేమ పాలనకు గ్రామాల్లో ప్రజలు ఆకర్షితులవుతున్నారని త్వరలో అద్దంకి నియోజకవర్గంలో టీడీపీ ఉనికి కోల్పోవటం ఖాయమని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి అన్నారు.

మంగళవారం మండలంలోని కొప్పరపాడు గ్రామంలో 20 కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరారు. వీరందరికీ పార్టీ కండువాలు వేసి హనిమిరెడ్డి స్వాగతం పలికారు. వైఎస్సార్ సీపీలో కష్టించి పని చేసే ప్రతి కార్యకర్తకు గుర్తింపు తెస్తానన్నారు. టీడీపీ కూటమికి ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కొప్పరపాడు గ్రామ స్థానిక నేతలు మూఢావత్ దానానాయక్, బండారు గురవయ్య, బుర్రి ఆదినారాయరణ, కుంపు ఆదెయ్య ఆధ్వర్యంలో పలువురు స్థానికులు పార్టీలో చేరారు.

వైఎస్సార్ సీపీలోకి టీడీపీ, జనసేన నాయకులు

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలో టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలోకి చేరేవారి సంఖ్య రోజు రోజుకూ పెరుగుతూనే ఉంది. అందులో భాగంగా పీ.గుడిపాడు గ్రామంలో టీడీపీ, జనసేన పార్టీకి చెందిన 15 కుటుంబాల వారు మంగళవారం అసెంబ్లీ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి సోదరుడు నరశింహారెడ్డి సమక్షంలో పార్టీలోకి చేరారు. పార్టీలోకి వచ్చిన వారిని ఆయన కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పీ.గుడిపాడు గ్రామ నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

'పోటీ చేసే చోట ఓటు లేని నేత ఆనందబాబు'

వేమూరు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు

కొల్లూరు : రాజ్యాంగం ప్రసాదించిన ఓటు హక్కు తాను పోటీచేసే నియోజకవర్గంలో లేని వ్యక్తి మాజీ మంత్రి, వేమూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నక్కా ఆనందబాబు అని వేమూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు విమర్శించారు. మంగళవారం కొల్లూరులో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. తాను ప్యారాచూట్‌లో వచ్చినప్పటికీ నియోజకవర్గ ప్రజలతో మమేకమై ఉంటున్నానని, తన ఓటు హక్కు నియోజకవర్గంలోనే ఉందన్నారు. ఓటు హక్కు గుంటూరులో ఉంచుకొని స్థానికంగా ఓటే లేని వ్యక్తి ఆనందబాబు అని, అటువంటి వ్యక్తి పేద ప్రజల కోసం ఏమి పని చేస్తాడని ప్రశ్నించారు. ఓటు వేసిన ప్రజలకు అందుబాటులో ఉండకుండా, వారి బాగోగులు పట్టించుకోకుండా గుంటూరు, తెనాలిలోని పెత్తందార్లకు పనులు చేసిపెట్టే నీకు నియోజకవర్గంలో అసలు ఓటు అడిగే హక్కు ఎక్కడ ఉందని ప్రశ్నించారు. తాను వేమూరు నియోజకవర్గంలోని కూచిపూడిలో నివాసం ఉంటూ ఉదయం నుంచి రాత్రి వరకు ప్రజలతో మమేకమై ఉంటున్నానని స్పష్టం చేశారు. వేమూరు నియోజకవర్గంలో కేరాఫ్ అడ్రస్ లేని వ్యక్తివి సిగ్గులేకుండా నాలుగో సారి వచ్చి ఓటు ఎలా అడుగుతావని ఓటు వేసిన పేద వర్గాలకు ఏమి న్యాయం చేస్తావని ప్రశ్నించారు.

సమావేశంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సూర్యదేవర రామకృష్ణ, జేసీఎస్ మండల కన్వీనర్ అయిల సుబ్బారావు, వైస్ ఎంపీపీ మురాల రాంబాబు, మాజీ ఎంపీపీ పెరికల పద్మారావు, నాయకులు కూచిపూడి మోషే, వెంకటరెడ్డి, కఠెవరపు జేసుదాసు తదితరులు పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్ పాలనలో ముస్లింలకు మేలు

- ఓడిపోతామనే భయంతోనే సీఎం జగన్‌పై రాళ్ల దాడి
- నూర్‌బాషా కార్పొరేషన్ చైర్మన్ రసూల్


మాట్లాడుతున్న రాష్ట్ర నూర్‌బాషా కార్పొరేషన్ చైర్మన్ రసూల్

అద్దంకి: ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్ అమలు కావడం దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి చలువేనని నూర్‌బాషా కార్పొరేషన్ చైర్మన్ రసూల్ అన్నారు. పట్టణంలోని బ్రహ్మంగారి దేవస్థానం సమీపంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్ తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావడంతో రాష్ట్రానికి ఎంతో మేలు జరిగిందన్నారు. పాదయాత్ర చేసే సమయంలో నూర్‌బాషా ఫెడరేషన్‌ను కార్పొరేషన్ చేస్తానని హామీ ఇచ్చి నెరవేర్చారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దూదేకులందరికీ అండగా ఉన్నారన్నారు. మళ్లీ మనమంతా వైఎస్సార్ సీపీ అధికారంలోకి తెచ్చుకునేలా పని చేయాలని పిలుపునిచ్చారు.

రాష్ట్రంలోని మహిళలందరికీ నవరత్నాల పథకాలతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేలు చేశారని అధికార భాషా సంఘం సభ్యురాలు మస్తానమ్మ అన్నారు. ప్రజలకు మంచి చేసిన సీఎంపై గెలవలేమనే భయంతోనే కుతంత్రాల కూటమి రాయితో దాడి చేయించిందని ఆరోపించారు. జగనన్న ప్రభుత్వంలోనే మనకు మేలు జరిగిందని అన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీలు తమ వారికే పథకాలు అందించాయని గుర్తు చేశారు. సమావేశంలో రాష్ట్ర యువజన సంఘం కార్యదర్శి కొటికలపూడి శ్రీను, మార్కెట్ యార్డు డైరెక్టర్ వేల్పూరి మస్తాన్, మండల అధ్యక్షుడు మౌలాలి, లాయర్ రఫీ, కొటికలపూడి మీరావలి, షేక్ మొహుద్దీన్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ప్రతి పేదవాడికి అండగా ఉంటాం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కరణం బలరాం


సమావేశానికి హాజరైన మహిళలు

- ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి
- అసెంబ్లీ అభ్యర్థి కరణం వెంకటేష్ గెలుపుకు సమష్టిగా కృషి చేద్దాం

వేటపాలెం: ప్రతి పేదవాడికి అండగా ఉంటానని చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి హామీ ఇచ్చారు. మంగళవారం రాత్రి మండలంలోని దేశాయిపేట పంచాయతీ హియాపురం, విఘ్నేశ్వర కాలనీ, శారదకాలనీ, ఎస్టీ కాలనీల ప్రజలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదల పక్షపాతి అన్నారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా పథకాలు ప్రవేశపెట్టి అమలు చేశారని గుర్తు చేశారు. ప్రతి పేదవాడికి నేరుగా లబ్ధి చేకూరే విధంగా పథకాలు రూపకల్పన చేశారన్నారు. ఇళ్లు లేని ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలంతో పాటు ఇళ్లు మంజూరు చేశారని చెప్పారు. ఎన్నికల్లో కరణం వెంకటేష్ వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా నిలబడుతున్నాడని తెలిపారు. మీ ఓట్లు వెంకటేష్‌కి వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. తనుబొద్ది మస్తాన్ రెడ్డి మాట్లాడుతూ కరణం కుటుంబానికి చీరాలతో విడదీయరాని బంధం ఉందన్నారు. పేదల పక్షపాతి కుటుంబంగా పేరు తెచ్చుకున్నారని గుర్తుచేశారు. వెంకటేష్‌కి మనందరం ఓట్లు వేసి గెలుపించుకోవాలని ఆయన పిలుపు నిచ్చారు. అనంతరం ఎమ్మెల్యే బలరామ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బొద్దు సుబ్బారావు, జేసీఎస్ కన్వీనర్ లేళ్ల శ్రీధర్, మాజీ ఎంపీపీ చల్లా జనార్ధనరావు, కన్నా లక్ష్మారావు, దంతం హనుమంతరావు, బట్ట శ్రీనివాసరావు, బట్ట రాంబాబు, బట్టా సుబ్బారావు, గుత్తి శ్రీనివాస రావు, పింజ సుబ్రహ్మణ్యం, శవనం దుర్గా పాల్గొన్నారు.

అవగాహనతో అగ్ని ప్రమాదాలు దూరం

అగ్నిమాపక శాఖ అధికారి వై.సాంబశివరావు


అగ్ని ప్రమాదాలపై అవగాహన కలిగిస్తున్న సిబ్బంది

రేపల్లె రూరల్: అగ్ని ప్రమాదాల నివారణకు అగ్నిమాపకశాఖ నిరంతరం కృషి చేస్తుందని ఆ శాఖ అధికారి వై.సాంబశివరావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా పట్టణంలోని వివిధ అపార్ట్‌మెంట్‌లలో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని ప్రజలకు అగ్ని ప్రమాదాలు సంభవించిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రమాదాలు వాటిల్లిన సమయంలో తమ ప్రాణాలను సైతం లెక్కచేయక సాధారణ స్థితికి తీసుకువచ్చేందుకు అగ్నిమాపక సిబ్బంది శక్తివంచన లేకుండా కృషి చేస్తారన్నారు. 24 గంటలూ ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రమాదాలు జరిగే ప్రదేశాలకు జాప్యం చేయకుండా వెళ్లి ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా ఉండేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తామని వెల్లడించారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదాలు సంభవించే విధానాలు, సంభవించిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రయోగపూర్వకంగా వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపకశాఖ సిబ్బంది నాగేశ్వరరావు, ఎస్.నాగేంద్రరెడ్డి, జీ.కోటేశ్వరరావు, వి.సుబ్బారావు, ఎం.జనార్ధనరావు, కేవీ సాయికృష్ణారెడ్డి, పి.హరిబాబు, బీ.వీరకుమార్, సీహెచ్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి


మృతుడు శ్రీనివాసులు

బాపట్లటౌన్: వాహనాన్ని అతివేగంగా నడుపుతూ చెట్టుకు ఢీకొట్టిన ఘటనలో ఆటో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మంగళవారం మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే చీరాల మండలం తోటవారిపాలెం గ్రామానికి చెందిన వంగర గంగాధర్ తనకు ఆటోను నడిపేందుకు అదే గ్రామానికి చెందిన గుండుబోయిన శ్రీనివాసులు (27)ను డ్రైవర్‌గా తీసుకొని గుంటూరుకు వెళ్తున్నాడు. బాపట్ల మండలంలోని అప్పికట్ల యారకాలువ సమీపంలోకి వచ్చేసరికి ఆటో అతి వేగంగా వెళుతుండడంతో అదుపుతప్పి పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో డ్రైవర్ శ్రీనివాసులు అక్కడికక్కడే మృతిచెందాడు. ఆటో యజమాని గంగాధర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బాపట్ల రూరల్ సీఐ శ్రీహరి కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు.

సీఎం జగన్‌పై దాడి హేయమైన చర్య

పట్నంబజారు: రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిపై దాడి అత్యంత హేయమైన చర్య అని రిటైర్డ్ ఎస్పీ చన్నంశెట్టి చక్రపాణి ఖండించారు. బ్రాడీపేటలోని ఆయన కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నీచ రాజకీయాలతో రాష్ట్ర ముఖ్యమంత్రిపై టీడీపీ నేతలు దాడులు చేయించడం సిగ్గుచేటని తెలిపారు. రాజకీయంగా ఆయన్ను ఎదుర్కోలేక హతమార్చేందుకు రాళ్ల దాడి చేయించడం ఆందోళన కలిగించే అంశమని పేర్కొన్నారు. చంద్రబాబు తొలి నుంచి హత్యారాజకీయాలకు నాంది పలుకుతూనే ఉన్నారని విమర్శించారు. వైఎస్సార్ సీపీలో ఉన్నదంతా కూలీలంటూ విమర్శలు చేయడం సరికాదని తెలిపారు.

సమర్థంగా విధులు నిర్వహించాలి

సెబ్ డిప్యూటీ కమిషనర్ కె.శ్రీనివాసులు

నగరంపాలెం: జిల్లాలో సెబ్ అధికారులు, సిబ్బంది సమర్థంగా విధులు నిర్వహించాలని సెబ్ డిప్యూటీ కమిషనర్ కె.శ్రీనివాసులు చెప్పారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని సెబ్ ఏఎస్పీ కార్యాలయంలో సెబ్ అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అక్రమంగా మద్యం నిల్వలున్న గోడౌన్లను గుర్తించాలని, అనధికార కార్యకలాపాలు నిర్వహించే వారిపై నిఘా ఉంచాలని తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా జిల్లాకు తరలించే మద్యం రవాణాపై నిఘా ఉంచాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా ఏఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్ ఎల్.రంగారెడ్డి, అసిస్టెంట్ సూపరింటెండెంట్ కృష్ణకిశోర్‌రెడ్డి, హెడ్ క్వార్టర్స్ ఏఈఎస్ ప్రభాకర్, పలువురు సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయం తథ్యం

- చిన హనిమిరెడ్డికి మద్దతు తెలిపిన నూర్‌బాషా, మాదిగ కార్పొరేషన్ నాయకులు
- పార్టీ విజయానికి కృషి చేస్తామని హామీ


హనిమిరెడ్డిని కలిసిన రసూల్, మస్తానమ్మ, కనకారావు

అద్దంకి రూరల్: అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డికి నూర్‌బాషా రాష్ట్ర సంఘ అధ్యక్షుడు రసూల్, అధికార భాషా సంఘం రాష్ట్ర సభ్యురాలు డి.మస్తానమ్మ, మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కె. కనకారావులు మంగళవారం పార్టీ కార్యాలయంలో కలిసి మద్దతు తెలియజేశారు. నియోజకవర్గంలో గ్రామ గ్రామాన వైఎస్సార్ సీపీ పాలనలో జగనన్న అందించిన సంక్షేమాన్ని, అభివృద్ధిని తెలియజేస్తామన్నారు. జగనన్న పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రిజర్వేషన్ కల్పించి సామాజిక న్యాయాన్ని అమలు చేశారన్నారు. గ్రామ గ్రామాన ప్రచారం చేపట్టి హనిమిరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. అనంతరం హనిమిరెడ్డి మాట్లాడుతూ జగనన్న పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ప్రతి ఒక్కరి హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించారని, రానున్న ఎన్నికల్లో 175 స్థానాలకు 175 స్థానాలు గెలుపొందుతామన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

జిల్లాలో సజావుగా 'స్లాష్'

- పరీక్ష రాసిన 3,460 మంది విద్యార్థులు
- సాల్ట్ ప్రోగ్రాంలో భాగంగా నిర్వహణ


అంకిరెడ్డిపాలెంలో స్లాష్ నిర్వహణను పరిశీలిస్తున్న డీఈవో శైలజ

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాల్ని మెరుగుపర్చేందుకు అమలు చేస్తున్న సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రోగ్రామ్ (సాల్ట్) లో భాగంగా గుంటూరు జిల్లాలోని ఎంపిక చేసిన పాఠశాలల్లో మంగళవారం స్టేట్ లెవల్ అచీవ్‌మెంట్ సర్వే (స్లాష్) నిర్వహించారు. రాష్ట్ర విద్య పరిశోధన శిక్షణ సంస్థ (ఎస్సీఈఆర్టీ), ఎడ్యుకేషనల్ ఇనిషియేటివ్స్ సంయుక్తంగా 129 ప్రభుత్వ పాఠశాలల్లో నాలుగో తరగతి చదువుతున్న 3,460 మంది విద్యార్థులకు తెలుగు, ఆంగ్ల, గణిత పాఠ్యాంశాల వారీగా ఎంపిక చేసిన రెండు సబ్జెక్టుల్లో పరీక్ష నిర్వహించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ తెలిపారు. భాషా, గణిత సామర్థ్యాల్ని అంచనా వేయడం కోసం నిర్వహించిన పరీక్షలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నట్లు చెప్పారు. ఈసందర్భంగా ఆమె గుంటూరు రూరల్ అంకిరెడ్డిపాలెంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్లాష్ నిర్వహణ తీరుతెన్నులను పరిశీలించారు. గుంటూరులోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించిన సమగ్రశిక్ష ఏపీసీ జి. విజయలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థుల్ని తీర్చిదిద్దేందుకు స్లాష్ ఉపయోగపడుతుందని అన్నారు. డీసీఈబీ కార్యదర్శి జి. లలిత ప్రసాద్ నంబూరులోని జెడ్పీ గరల్స్ హైస్కూల్‌ను సందర్శించారు. కార్యక్రమంలో ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం, ఏఎంవో ప్రసాద్, ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల హెచ్ఎం బి.విజయలక్ష్మి, ఉపాధ్యాయురాలు రాబియా బస్రీ, సీఆర్పీలు పాల్గొన్నారు.